సాక్షి
అనంతపురం
సోమవారం ၊ 11 ၊ డిసెంబర్ ၊ 2023



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఉత్సాహంగా సాక్షి మ్యాథ్స్‌-బీ

సాక్షి మ్యాథ్స్ -బీ, స్పెల్ బీ టాలెంట్ సెర్చ్ పరీక్షలు అనంతపురంలో ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలు రాశారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.4°/19.2°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

పీఏబీఆర్‌లో 2.37 టీఎంసీల నీరు



పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ జలాశయానికి ఇన్‌ఫ్లో పూర్తి బంద్ అయ్యింది. డ్యాం వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి, అనంతపురం, శ్రీరామిరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు రోజూ సుమారు 60 క్యూసెక్కులు, లీకేజీలు, ఇతరత్ర కింద 110 క్యూసెక్కుల నీరు వెళ్తోంది. ఆదివారం నాటికి జలాశయంలో 2.37 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. ఇన్‌ఫ్లో బంద్ అయినప్పటికీ తాగునీటి ప్రాజెక్టులకు నీటి కొరతేమీ ఉండదన్నారు. 1.5 టీ ఎంసీల నీరు నిల్వ ఉన్నా ప్రాజెక్టులకు నీటి సమస్య ఉండదని ఆమె స్పష్టం చేశారు.

అక్రమ మద్యం నియంత్రణకు చర్యలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం: అక్రమ మద్యం నియంత్రణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ధాబాలు, హోటళ్లలో పోలీసులు ఆదివారం దాడులు చేపట్టారు. హోటళ్లు, డాబాల్లో మద్యం విక్రయించడం, అనుమతించడంతో పాటు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నిషేధం. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా అక్రమంగా మద్యం వినియోగానికి అనుమతి లేకుండా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా ఆదివారం తనిఖీలు చేపట్టారు. పార్కులు, శివారు ప్రదేశాలు, వల్నరబుల్ ప్రాంతాల్లో మద్యం వినియోగించకుండా ప్రత్యేక నిఘా వేశారు. జిల్లాలోకి కర్ణాటక మద్యం అక్రమ రవాణా, విక్రయాలు జరగకుండా జిల్లా అంతటా వాహనాల తనిఖీలు, దాడులు చేపట్టారు. పలు లాడ్జీల్లో తనిఖీలు చేశారు. బస చేసే వ్యక్తులు అనుమానాస్పదమని భావిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని లాడ్జీల నిర్వాహకులకు సూచించారు.

నేడు కేంద్ర బృందం రాక



దెబ్బతిన్న వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన జాయింట్ సెక్రెటరీ పంకజ్ యాదవ్ నేతృత్వంలో 10 మంది ఉన్నతాధికారులతో కూడిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ (కేంద్ర కరువు బృందం) సోమవారం రాత్రి అనంతపురం రానుందని అధికార వర్గాలు తెలిపాయి. మంగళవారం ఉదయం జిల్లా అధికారులతో కరువు పరిస్థితులపై సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మూడు బృందాలుగా విడిపోయి ఒక బృందం కామారుపల్లి, కురుగుంట, పామిడి మండలం ఎద్దులపల్లి, అనుంపల్లి గ్రామాల్లో పర్యటించనుంది. రెండో బృందం రాయదుర్గం మండలం ఆవులదట్ల, జుంజురాంపల్లి, కళ్యాణదుర్గం మండలం చాపిరి, గరుడాపురం గ్రామాల్లో, మూడో బృందం ఉరవకొండ మండలం ఆమిద్యాల, రాకెట్ల, ఆత్మకూరు మండలం తలుపూరు, తోపుదుర్తి గ్రామాల్లో పర్యటించనున్నాయి. మూడు బృందాలు రాత్రికి అనంతపురం చేరుకుంటాయి. 13, 14 తేదీల్లో మూడు బృందాలు అన్నమయ్య, ఎన్టీఆర్, శ్రీసత్యసాయి, చిత్తూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కరువు పరిస్థితులు తెలుసుకోనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

పేదలకు పెద్ద మేలు

నివేశన స్థలాల కోసం అనేక ఏళ్లుగా నిరీక్షిస్తున్న పేదలకు జగన్ సర్కార్ ఊరట కలిగించింది. కోర్టు వివాదంలో ఉన్న స్థలాలను క్లియరెన్స్ చేసి పట్టాలు మంజూరు చేసింది. వారి సొంతింటి కల సాకారానికి బాటలు వేసింది. గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసంతో ఆశలు వదులుకున్న పేదలు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో న్యాయం జరగడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ఏళ్ల నిరీక్షణకు తెర

- నాడు బోగస్ పట్టాలతో టీడీపీ బురిడీ
- కోర్టు వివాదంలోని స్థలాలకు వైఎస్సార్‌సీపీ సర్కారు క్లియరెన్స్
- ఉరవకొండలో 3,500 మంది లబ్ధిదారులకు పట్టాల మంజూరు



ఉరవకొండ ఈద్గా లేఅవుట్‌లో తమకు కేటాయించిన ప్లాట్లు చూసుకునేందుకు తరలివచ్చిన లబ్ధిదారులు

ఉరవకొండ: టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 సార్వత్రిక ఎన్నికల వేళ ఓట్ల కోసం గిమ్మిక్కులు చేశారు. ఏకంగా 15 సర్వే నంబర్లు పొందుపరచి.. హద్దులు పేర్కొనకుండానే తయారు చేసిన ఇంటి పట్టాలను ఉరవకొండలో పేదలకు పంపిణీ చేశారు. పేదలకు పట్టాలు తన ఘనతేనంటూ పయ్యావుల కేశవ్ పబ్లిసిటీ చేసుకున్నారు. కానీ అస్పష్టంగా ఉన్న ఆ పట్టాలన్నీ చెల్లవని తేలింది. తాము నిలువునా మోసపోయామని బాధితులు లబోదిబోమన్నారు. ఎన్నికల్లో పయ్యావుల కేశవ్ ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ పేదల ఇంటి పట్టాల సమస్యను పట్టించుకోలేదు. విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు, టీవీ చానెళ్ల, సోషల్ మీడియాకు పరిమితమయ్యారు. పైగా నియోజకవర్గ టీడీపీ నేతలు పేదలకు స్థలాలు అందకూడదనే ఉద్దేశంతో సదరు సర్వే నంబర్ల భూయజమానులపై ఒత్తిడి తెచ్చి పరిహారం పెంచాలంటూ కోర్టులో కేసులు వేయించారు.

జగన్ సర్కారు చొరవ..

ఉరవకొండలోని పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు వైఎస్సార్‌సీపీ సర్కారు చొరవ తీసుకుంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద అర్హత కలిగిన వారందరికీ స్థలాల కేటాయింపునకు చర్యలు చేపట్టింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక చొరవతో ఉరవకొండ పట్టణంలో ఏకంగా 3,500 మంది పేదలకు ఇంటి పట్టాలు మంజూరయ్యాయి. ఇది ఒక రికార్డుగా చెప్పుకోవచ్చు. ఏళ్లుగా ఉన్న భూవివాదం హైకోర్టులో పరిష్కారమయ్యేలా శ్రద్ధ చూపడంతో తొలి విడతగా 560 ఇంటిపట్టాలను వై.విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదుగా ఇటీవలే పంపిణీ చేశారు. స్థలాలను కూడా చూపించారు. మిగిలిన వారికి కూడా పట్టాలు సిద్ధం చేశారు. వారికి త్వరలోనే అందించనున్నారు. నాడు ఎమ్మెల్యే కేశవ్ దొంగపట్టాలతో తమను మోసం చేస్తే.. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విశ్వేశ్వరరెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా పట్టాలు మంజూరు చేయించారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో ఇళ్ల నిర్మాణం..



ఉరవకొండ కొలిమిలేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

పేదలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయించాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఆయన కృషితో జిల్లాలోనే రికార్డుస్థాయిలో ఉరవకొండ నియోజకవర్గానికి 21 వేల పక్కా ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

మేలు చేసిన వారిని మరువం



గతంలో ఓట్ల కోసం బోగస్ పట్టాలు పంపిణీ చేసి మోసం చేశారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గెలిచిన తర్వాత కూడా పట్టాల గురించి పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మా పక్షాన నిలబడ్డారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం హామీ పత్రాలు అందించి.. కోర్టు వివాదం పరిష్కరించి ఇంటి స్థలం చూపించారు. మేలు చేసిన వారిని ఎన్నటికీ మరచిపోము.

– షాకీరా, లబ్ధిదారు, ఉరవకొండ

సంతోషంగా ఉంది



నాడు 15 సర్వే నంబర్లతో ప్రభుత్వం పట్టా ఇచ్చింది. అయితే అందులో హద్దులు చూపకుండా నిలువునా మోసం చేసింది. జనంతో మమేకమయ్యే విశ్వ అన్న సీఎం జగనన్నతో మాట్లాడి మాకు సమగ్ర వివరాలతో కూడిన పట్టా ఇప్పించి, పక్కాగృహం మంజూరు చేయించారు. చాలా సంతోషంగా ఉంది.

– ఈశ్వరమ్మ, రంగావీధి, ఉరవకొండ

రుణపడి ఉంటాం



15 ఏళ్లుగా బాడుగ ఇంట్లో ఉంటూ అవస్థలు పడ్డాం. కోర్టు వివాదంలో ఉన్న స్థలాలు జగన్ ప్రభుత్వంలో విశ్వ అన్న కృషితో పరిష్కారం అయ్యాయి. నాకు పట్టా ఇచ్చి పక్కా ఇల్లు కూడా మంజూరు చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

– కురసాల లావణ్య, చౌడేశ్వరి కాలనీ, ఉరవకొండ

పేదల కళ్లల్లో ఆనందం కన్పిస్తోంది



ఎమ్మెల్యే కేశవ్ అప్పట్లో ఓట్ల కోసం చెల్లని పట్టాలు ఇచ్చి ప్రజలను మోసగించాడు. అప్పట్లోనే నేను పేదల ఇంటి పట్టాల కోసం భారీ స్థాయిలో ఉద్యమించాను. రోడ్ల దిగ్బంధం, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలు చేపట్టి అరెస్టయ్యాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో రికార్డు స్థాయిలో ఉరవకొండ పట్టణానికి 3,500 పట్టాలు, నియోజకవర్గ వ్యాప్తంగా 21 వేల పక్కా ఇళ్లు మంజూరు చేయించాం. సొంతింటి కల సాకారమవుతున్న వేళ పేదల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం నాకు ఎంతో తృప్తినిస్తోంది.

– వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఉరవకొండ

జేసీ ప్రభాకర్‌రెడ్డి ఓ ఉన్మాది

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా ధ్వజం



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి టౌన్: అధికారం లేకపోవడంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఓ ఉన్మాదిలా మారాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. తాడిపత్రి ప్రశాంతతకు భంగం కలిగిస్తూ అధికారులపై అసత్య ఆరోపణలతో మతిలేని రాజకీయాలు చేస్తూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు అంబాసిడర్‌గా మారాడని ధ్వజమెత్తారు. ఆదివారం తాడిపత్రిలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని పోలీస్ స్టేషన్లకు తాళాలు వేసి, పోలీసులను దుర్భాషలాడిన నీచ చరిత్ర జేసీ ప్రభాకర్‌రెడ్డిదన్నారు. తన మాట వినలేదన్న అక్కసుతో పోలీసు అధికారులపై అక్రమంగా కేసులు పెట్టించి పబ్బం గడుపుకున్నారన్నారు. అధికారం లేకపోవడంతో తాడిపత్రికి పోలీస్ అధికారులెవ్వరూ రావద్దు..స్వేచ్ఛగా పనిచేసే వీలులేదంటూ అసత్య ఆరోపణలు చేస్తున్నాడన్నారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత తాడిపత్రి ప్రాంతంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు తమ విధులను నిజాయితీతో స్వేచ్ఛగా నిర్వర్తిస్తున్నారన్నారు. తాడిపత్రిలో సీఐ హమీద్‌ఖాన్ పనితీరు బాగుందని, అయితే కొన్ని అంశాల్లో నిందితుల పట్ల కఠినంగా వ్యవహరించడంతో శాఖాపరమైన చర్యలను అధికారులు తీసుకున్నారన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తాడిపత్రి ప్రాంతంలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు.

వేధింపుల కేసు నమోదు

వజ్రకరూరు: అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ వజ్రకరూరు మండలం కమలపాడు తండాకు చెందిన మూడ్ గౌతమి ఫిర్యాదు మేరకు ఆమె భర్త, కుటుంబసభ్యులపై కేసు నమోదు చేసినట్లు వజ్రకరూరు పోలీసులు తెలిపారు. వివరాలు.. సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కమలపాడు తండాకు చెందిన దుర్గాప్రసాద్ నాయక్‌తో 2015లో గౌతమికి వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని నెలలుగా అదనపు కట్నం కోసం భర్త దుర్గాప్రసాద్ నాయక్, అత్త పద్మావతి వేధిస్తుండడంతో ఆదివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆరోగ్యసిరి

ప్రజారోగ్యానికి జగన్ సర్కారు అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఖరీదైన వైద్యాన్ని సైతం ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందించి రోగులను కాపాడేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందు కోసం ఇప్పటి వరకు ఉన్న వైద్య సేవల కోసం ప్రభుత్వం వెచ్చించే వ్యయాన్ని ఐదు రెట్లకు పెంచి సామాన్య ప్రజలకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తోంది.



అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్న రోగులు

- ప్రజారోగ్యానికి ప్రాధాన్యత
- ఆరోగ్యశ్రీ వ్యయం భారీగా పెంపు
- రూ.25 లక్షలకు పెరిగిన పరిమితి
- ఈ నెల 18న నూతన మార్గదర్శకాలు
- సర్కారు నిర్ణయంతో సామాన్యుల్లో మరింత ధైర్యం
- టీడీపీ హయాంతో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో మూడు రెట్లు పెరిగిన లబ్ధిదారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అందించే వైద్య సేవల వ్యయం త్వరలోనే భారీగా పెరగనుంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రీమియం త్వరలోనే భారీగా పెరగనుంది. మొన్నటి వరకు ఒక కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల దాకా ఉన్న ఆరోగ్యశ్రీ చికిత్సల వ్యయ పరిమితి ఇప్పుడు రూ.25లక్షలకు పెంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 18న నూతన మార్గదర్శకాలు వెలువడనున్నాయి. దీంతో సామాన్యులు, పేదవాళ్లు, కూలీలు ఎవరైనా సరే ఎంత పెద్ద జబ్బు చేసినా ఉచితంగా వైద్యం పొందచ్చు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పురుడు పోసుకున్న ఈ పథకం ఇప్పుడు ఇంతింతై వటుడింతై అన్నట్టు పాతిక లక్షల రూపాయల వ్యయ పరిమితికి చేరుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాజా అంచనాల ప్రకారం 44 లక్షల వరకు జనాభా ఉంది. ఇందులో వార్షికాదాయం 5 లక్షల లోపు ఉన్నవాళ్లందరూ లబ్ధిపొందచ్చు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో కనీసం 35 లక్షల మంది వరకూ లబ్ధి పొందే అవకాశం ఉంది.

ఉమ్మడి అనంతలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వివరాలు ఇలా	
నెట్‌వర్క్‌లో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు	56
వైద్యవిధానపరిషత్ ఆస్పత్రులు	22
ప్రభుత్వ సర్వజనాసుపత్రి	01
పీహెచ్‌సీలు	73
మొత్తం ఆరోగ్యశ్రీ కార్డులు	12,02,000
పథకం పరిధిలో ఉన్న చికిత్సలు	3,257
గడిచిన నాలుగేళ్లలో లబ్ధిదారులు	3,73,735
నాలుగేళ్లలో ఖర్చు చేసిన వ్యయం	రూ.673.02 కోట్లు
వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు	1,78,165
ఆసరా కోసం చేసిన వ్యయం	రూ.91.32 కోట్లు

పెద్ద జబ్బులొచ్చినా.. ఆందోళన వద్దు

చికిత్సలకు ఇచ్చే ప్రీమియం పెంచడం వల్ల ఇకపై పెద్ద పెద్ద జబ్బులొచ్చినా ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. ఒక్కోసారి క్యాన్సర్, బోన్‌మ్యారో వంటి జబ్బులకు రూ.15 లక్షల వరకు అవుతుంది. ఇలాంటి కేసుల్లో పేదవాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకపై ఎంత పెద్ద జబ్బు వచ్చినా భయపడాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఆరోగ్య చికిత్సల్లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్, బోన్‌మ్యారో, కాక్లియర్ ఇంప్లాంట్స్ వంటి ఖరీదైన జబ్బులు ఉచితంగానే జరుగుతున్నాయి. ఇకపై ఇంతకంటే ఎక్కువ వ్యయం అయినా ప్రభుత్వమే భరిస్తుంది. వ్యవసాయాధారిత జిల్లాగా పేరుపొందిన ఇక్కడ ఎక్కువగా వ్యవసాయ కూలీలే ఉన్నారు. వీరికి ఇప్పుడు సర్కారు మరింత భరోసా కల్పించినట్టయింది.

పెరిగిన లబ్ధిదారుల సంఖ్య

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో గతంలో ఏటా 25 వేలకు మించి ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు నమోదయ్యేవారు కాదు. కానీ గడిచిన నాలుగేళ్లలో సగటున ఏడాదికి 95 వేల మంది ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చికిత్స చేయించుకున్నారు. చికిత్సల సంఖ్య 1,059 నుంచి 3,257కు పెంచడంతో అన్ని జబ్బులకూ వైద్యం లభిస్తోంది. దీనికి తోడు ఇప్పుడు ప్రసవాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చడంలో లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క గర్భిణులే ఏటా 40వేల మందికి పైగా ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందుతున్నారు. అంతేకాదు కోలుకునే సమయంలో రోజుకు రూ.225 చొప్పున గరిష్ఠంగా నెలకు రూ.5వేలు పొందుతున్నారు. దేశ చరిత్రలో ఏపీలోనే ఇలాంటి పథకం అమలవుతోంది.

పెద్ద జబ్బులకూ ఉచిత చికిత్స

ఆరోగ్యశ్రీ పథకం పరిధిలో ఇప్పటికే అన్ని రకాల పెద్ద పెద్ద జబ్బులకూ వైద్యం ఉచితంగా లభిస్తోంది. సర్కారు తాజా నిర్ణయంతో ఎంత పెద్ద జబ్బుకైనా చికిత్స చేయించుకునేందుకు అర్హత లభిస్తుంది. దీంతో ప్రాణాపాయ జబ్బు వచ్చినా సామాన్యులు భయపడాల్సిన పనిలేదు. – డా.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

అక్కరకు అత్యాధునిక పరిజ్ఞానం

- డిజిటల్ చదువులకు సర్కారు పెద్దపీట
- రెండోవిడతగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల పంపిణీకి శ్రీకారం



నార్పల మండలం దుర్గం ఎంపీయూపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారు. చదువుతోనే పేదరికాన్ని జయించవచ్చని ప్రధానంగా నమ్మిన ముఖ్యమంత్రి విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునేందుకు అవసరమైన అన్ని వనరులు సమకూర్చేందుకు ఎక్కడా రాజీపడడం లేదు. ఈ క్రమంలో పేద వర్గాల పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రతి తరగతి గదిలో డిజిటల్ విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు.

అత్యధికంగా అనంతపుర అర్బన్‌కు..

నేటి పరిస్థితుల్లో పిల్లలు ప్రపంచ స్థాయిలో పోటీపడాలంటే ఆధునిక బోధన అమలు తప్పనిసరి. ఈ విషయాన్ని అర్థం చేసుకున్న జగన్ ప్రభుత్వం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6–10 తరగతుల విద్యార్థులకు ఐఎఫ్‌పీల ద్వారా బోధన సాగించాలని నిర్ణయించింది. 'మనబడి నాడు–నేడు' కింద ఎంపికైన పాఠశాలల్లో గతేడాదిలో తొలివిడతగా 245 స్కూళ్లకు 1595 ఐఎఫ్‌పీలు సరఫరా చేశారు. తాజాగా రెండోవిడతగా 340 స్కూళ్లకు 1579 ఐఎఫ్‌పీలు సరఫరా చేస్తున్నారు. రెండోవిడతలో అత్యధికంగా అనంతపుర అర్బన్, రూరల్ మండల పరిధిలో 24 స్కూళ్లకు 149 ప్యానెళ్లు, అత్యల్పంగా బుక్కరాయసముద్రం మండలంలో 8 స్కూళ్లకు 22 ప్యానెళ్లు కేటాయించారు. రెండు రోజుల్లో నేరుగా ఆయా స్కూళ్లకు చేరనున్నాయి.

ప్రాథమిక స్థాయిలోనూ 'స్మార్ట్' చదువులు..

ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతుల విద్యార్థులకు ఇప్పటికే స్మార్ట్‌టీవీల ద్వారా బోధిస్తున్నారు. ఇప్పటికే తొలివిడతగా జిల్లాకు స్మార్ట్‌టీవీలు వచ్చాయి. రెండో విడతగా కూడా తక్కిన స్కూళ్లకు త్వరలోనే సరఫరా కానున్నాయి.ఇక 6–10 తరగతుల విద్యార్థులకు బోధన కోసం సరఫరా చేసే ఐఎఫ్‌పీలను ప్రతి పాఠశాలలో ఒక్కో తరగతి గదిలో ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య అనుగుణంగా ఒక్కో పాఠశాలకు 15 నుంచి 25 ప్యానళ్లు ఏర్పాటు చేశారు.

ఖర్చుకు వెరవకుండా..

ఒక్కో ఇంటారాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌ను తరగతి గదిలో ఏర్పాటు చేయడానికి రూ. 1.60 లక్షల దాకా ఖర్చవుతుంది. ఈ ప్రకారం ఒక్కో పాఠశాలకు సంఖ్యను బట్టి రూ. 24 లక్షల నుంచి రూ. 40 లక్షలు ఖర్చు చేస్తున్నారు. తొలివిడత సరఫరా చేసిన ప్యానెళ్లకు రూ.25.26 కోట్లు, రెండోవిడతగా సరఫరా చేస్తున్న ప్యానెళ్లకు రూ. 25.52 కోట్లు కలిపి మొత్తం రూ. 50.78 కోట్లు ఖర్చు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవుతున్న విద్యార్థులకు అత్యాధునిక బోధన అందించాలనే దృఢ సంకల్పంతో ఉన్న జగన్ ప్రభుత్వం ఖర్చుకు వెనకడుగు వేయడం లేదు.

ఎంఈఓలు అప్రమత్తంగా ఉండాలి



జిల్లాకు రెండోవిడతలో 340 స్కూళ్లకు 1,579 ఐఎఫ్‌పీలు వస్తున్నాయి. నేరుగా ఆయా స్కూళ్లకు తీసుకొస్తారు. మండల విద్యాశాఖ అధికారులు వాటిని కంపెనీ వారితోనే తరగతి గదుల్లో ఇన్‌స్టాల్ చేయించాలి. నాడు–నేడు కింద ఎంపికైన అన్ని స్కూళ్లకు దాదాపు వచ్చినట్లే.

– వి.నాగరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి

వైద్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివి



మాట్లాడుతున్న రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: గ్రామీణ ప్రాంత ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తున్న సత్యసాయి మొబైల్ ఆస్పత్రి సిబ్బంది సేవలు వెలకట్టలేనివని సత్యసాయి సెంట్రల్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు కొనియాడారు. మొబైల్ ఆస్పత్రి 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో సిబ్బందితో సత్సంగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రత్నాకర్ రాజు మాట్లాడుతూ సత్యసాయి బోధనలను ఆదర్శంగా తీసుకుని లాభాపేక్ష లేకుండా పనిచేయడం గర్వకారణమన్నారు. సత్యసాయి మొబైల్ ఆస్పత్రి సేవలను 2006లో ప్రారంభించారని గుర్తు చేశారు. వందలాది మంది వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, వలంటీర్లు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి స్వచ్ఛందంగా ముందుకు వస్తూ సేవలకు సహకరిస్తున్నారని చెప్పారు. మొబైల్ ఆస్పత్రి సంజీవని బస్సుల్లో ఆధునిక సాంకేతిక వైద్య పరికరాల ద్వారా రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. రోగి ఆరోగ్య స్థితి బాగుపడే వరకూ సూచనలు సలహాలు అందిస్తూ వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. భవిష్యత్తులో సత్యసాయి మొబైల్ వైద్యసేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సత్యసాయి మొబైల్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ నరసింహన్, తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సత్సంగ్‌లో పాల్గొన్న సత్యసాయి మొబైల్ వైద్య శాల సిబ్బంది

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, సోదరుడు

గుత్తి రూరల్: పొలానికి వెళ్లేందుకు దాయాదులు దారి విడువక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం రాంపురానికి చెందిన ఆదినారాయణ, సావిత్రమ్మ దంపతుల రెండో కుమారుడు కాయల రామచంద్ర (26)కు సమీప బంధువులతో పొలం రస్తా విషయంలో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం గుత్తి మండలం కొత్తపేట సమీపంలో తనకున్న మూడు ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంటను తొలగించి దిగుబడిని ఇంటికి తరలించేందుకు రామచంద్ర సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న దాయాదులు రస్తాకు అడ్డు వేయడంతో మూడు రోజులుగా ఎద్దులబండి అక్కడే ఆగిపోయింది. ఆదివారం మరోసారి దాయాదులతో రామచంద్ర మాట్లాడాడు. అయినా వారు ఒప్పుకోలేదు. ఆ సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న రామచంద్ర నేరుగా ఇంటికెళ్లి పురుగుల మందు డబ్బా తీసుకుని పొలం వద్దకు చేరుకుని తాగాడు. అటుగా వెళుతున్న వారు గమనించి సమాచారం అందించడంతో పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న రామచంద్రను గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రామచంద్ర మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఆదినారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వజ్రకరూరు: మండలంలోని గూళ్లపాళ్యం రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న వజ్రకరూరు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. 48 సంవత్సరాల వయసు ఉంటుందని, టీ షర్టు, నీలం రంగు డ్రాయర్ ధరించినట్లు వెల్లడించారు. కుడిచేతికి గాయమైన ఆనవాళ్లు ఉన్నాయన్నారు. వ్యక్తి మృతదేహాన్ని గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా సాక్షి మ్యాథ్స్-బీ

- మేధస్సుకు పదును పెట్టిన పరీక్ష
- ప్రయోజనకారిగా ఉందంటున్న ఉపాధ్యాయులు


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్: చిన్నారుల మేధస్సుకు పదును పెట్టేలా 'సాక్షి' మ్యాథ్స్-బీ, స్పెల్-బీ టాలెంట్ సెర్చ్ పరీక్ష ఉత్సాహంగా సాగింది. అనంతపురంలోని కోవూరు నగర్‌లో ఉన్న విశ్వ భారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ వేదికగా ఆదివారం సాగిన ఈ పరీక్షకు ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి. మొత్తం నాలుగు కేటగిరీల్లో విద్యార్థులు పోటీ పడ్డారు. 1వ కేటగిరీలో 1, 2 తరగతులకు చెందిన 14 మంది విద్యార్థులు, రెండో కేటగిరీలో 3, 4వ తరగతులకు చెందిన 10 మంది, 3వ కేటగిరీలో 5, 6, 7 తరగతులకు చెందిన 15 మంది, 4వ కేటగిరీలో 8, 9, 10 తరగతులకు చెందిన 10 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా స్థాయి విజేతలు త్వరలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పరీక్షా కేంద్రాన్ని సాక్షి యాడ్స్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌ఎం ఆశాసుల్తానా తదితరులు పర్యవేక్షించారు. కాగా, 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాలెంట్ సెర్చ్ పోటీలు విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేలా ఉన్నాయని పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ..

SAKSHI MATH BEE 2023-24

SAKSHI SPELL Bee 2023-24

స్పీడ్ థింకింగ్ పెరుగుతుంది



ప్రస్తుతం నేను థర్డ్ స్టాండర్డ్ చదువుతున్నా. ఇంతకు ముందు ఈ పరీక్ష రాసిన మా సీనియర్స్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ సారి నేనూ స్పెల్-బీ పరీక్ష రాశాను. ఇందు కోసం ప్రత్యేకంగా మా టీచర్ సాధన చేయించారు. చాలా వరకూ థింకింగ్ లెవల్స్ పెరుగుతాయని అందరూ అంటున్నారు కాబట్టి ఇకపై రెగ్యులర్‌గా ఇలాంటి పోటీ పరీక్షలకు హాజరవుతా. – అర్ఫాసారా, విద్యార్థిని

రెండు సార్లు స్టేట్ లెవల్‌కు వెళ్లా..



విశ్వభారతి స్కూల్లో ఇప్పటి వరకూ జరిగిన చాలా పోటీ పరీక్షల్లో నేను పాల్గొన్నాను. స్పెల్-బీ, మాథ్స్-బీలో రెండు సార్లు స్టేట్ లెవల్ వరకూ వెళ్లాను. గతంతో పోల్చుకుంటే ఈ తరహా పరీక్షల వల్ల మ్యాథ్స్‌పై నాకున్న భయం పూర్తిగా పోయింది. ప్రస్తుతం నేను వేగంగా ఎలాంటి లెక్కలైనా చేయగలుగుతున్నా. – గురు చరణ్‌సాయి, 10వ తరగతి

మ్యాథ్స్ అంటే క్వీన్ ఆఫ్ సబ్జెక్ట్స్

సాక్షి మీడియా వారు స్పెల్-బీ, మాథ్స్-బీ పరీక్షల నిర్వహణకు ఎక్కువగా మా పాఠశాలనే ఎంపిక చేస్తుండడం సంతోషదాయకం. అనేక సార్లు మా విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల వరకూ వెళ్లారు. గతంలో రెండు సార్లు చాంపియన్ షిప్‌నూ దక్కించుకున్నాం. మ్యాథ్స్‌ను క్వీన్ ఆఫ్ సబ్జెక్ట్స్ అంటారు. భవితను వేగంగా తీర్చిదిద్దుకునేందుకు పునాదిగా, క్రమశిక్షణకు ప్రయోజకారిగా మ్యాథ్స్ నిలుస్తుంది.
– ఆశా సుల్తానా, హెచ్‌ఎం, విశ్వభారతి పాఠశాల

రైల్వే డివిజన్‌కు అవార్డుల పంట


అవార్డు దక్కించుకున్న గుంతకల్లు రైల్వేస్టేషన్

గుంతకల్లు: దక్షిణ మధ్య రైల్వే వారోత్సవాల్లో భాగంగా ఏటా ప్రకటించే జోనల్ స్థాయి అవార్డుల్లో గుంతకల్లు డివిజన్‌కు పలు అవార్డులు దక్కాయి. 2022-23కు గాను స్టేషన్ల పరిశుభ్రత, ట్రాక్ మెయింటెనెన్స్, ఎల్‌సీ గేట్ల ఎత్తివేత, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయపాలన, డీజిల్ షెడ్, వర్క్‌షాపు నిర్వహణ తదితర విభాగాల్లో అవార్డులు దక్కాయి. త్వరలో సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్ భవన్‌లో జరిగే వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జీఎం అరుణ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులను డివిజన్ అధికారులు అందుకోనున్నారు.

గుంతకల్లు డివిజన్‌కు దక్కిన అవార్డులు ఇవే...
- క్లీన్ మెయింటెనెన్స్ స్టేషన్‌గా గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు జీఎం షీల్డ్ దక్కింది.
- డీజిల్, ఎలక్ట్రికల్ లోకో షెడ్ల నిర్వహణకు సంయుక్త జీఎం అవార్డులను గుంతకల్లు డివిజన్‌లోని గుత్తి డీజిల్ లోకో షెడ్డు, విజయవాడలోని ఎలక్ట్రికల్ లోకో షెడ్ కైవశం చేసుకున్నాయి.
- బెస్ట్ ట్రాక్ మిషన్స్, ట్రాక్ మెయింటెనెన్స్‌కు గుంతకల్లు, సికింద్రాబాద్ డివిజన్లకు సంయుక్తంగా జీఎం అవార్డులు దక్కాయి.
- డివిజన్‌లోని రేణిగుంట జంక్షన్‌కు చెందిన ఏఆర్‌టీ వాహనానికి బెస్ట్ మెయింటెనెన్స్ వాహనంగా గుర్తింపు.
- ఉత్తమ వర్క్‌షాప్ అవార్డును తిరుపతిలోని మెకానికల్ వర్క్‌షాపు కైవసం చేసుకుంది.
- తిరుపతి-జమ్ముతావి-తిరుపతి (రైలు నం .22705/06) హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు బెస్ట్ మెయింటెడ్ లాంగ్ డిస్టెన్స్ ట్రైన్స్ అవార్డు దక్కింది.

జనవాక్కు

జీవితాంతం మరువలేం



కూలి పనులతో జీవనం సాగిస్తున్న మేము ఏళ్ల తరబడి అద్దె ఇంట్లోనే నివాసమున్నాం. గతంలో ఎన్నికలు వస్తే అది చేస్తాం.. ఇది చేస్తామని రాజకీయ నాయకులు మా ఇళ్ల వద్దకు వచ్చి చెప్పి ఓట్లు వేయించుకున్నారు. గెలిచిన తర్వాత తిరిగి మా ఇళ్ల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. సంక్షేమ పథకాల లబ్ధి కూడా సక్రమంగా అందివ్వ లేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లి ఇంటి పట్టా తెచ్చిచ్చాడు. ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలో సొంతింట్లోకి వెళుతున్నాం. మాకు మంచి చేసిన జగనన్నను జీవితాంతం మరువలేం. – కళావతి, కంబదూరు

రూ.1.36 లక్షల లబ్ధి చేకూరింది



వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వివిధ పథకాల కింద మా కుటుంబానికి రూ.1.36 లక్షల లబ్ధి చేకూరింది. విద్యాదీవెన కింద రూ.62.320 లబ్ధి చేకూరడంతో మా కుమార్తె బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేయగలిగింది. మేము నివాసముంటున్న స్థలానికి హక్కు పత్రం ఇచ్చారు. సొంతిల్లు కూడా మంజూరు చేశారు. నా భర్త సుంకన్నకు ప్రతి నెలా రూ.2,750 పింఛన్‌ను వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నాడు. అన్ని విధాలుగా మమ్మల్ని ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉన్నాం.
– రామాంజినమ్మ, బేతాపల్లి, గుత్తి మండలం

రుణపడి ఉంటాం



మాకు సొంతిల్లు కట్టుకోవాలని ఎంతో కోరిక. అయితే పేదరికం కారణంగా ఇది సాధ్యం కాలేదు. గత పాలకుల ధోరణితో ఇక జీవితంలో సొంతిల్లు కట్టుకోలేమనుకున్నాం. జగన్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే వలంటీర్ వచ్చి వివరాలు తీసుకెళ్లి ఇంటి పట్టా తెచ్చిచ్చాడు. అతేకాక ఇల్లు కూడా మంజూరు చేయడంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో సొంతింట్లోకి చేరుకుంటాం. మా చిరకాల కోరిక నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. – లక్ష్మీదేవి, మామదూరు, బ్రహ్మసముద్రం మండలం

సొంతింటి కల నెరవేరింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మా కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఎన్నో ఏళ్లుగా కలగా ఉన్న సొంతిల్లు కూడా సాధ్యమైంది. ఇంత కాలం ఉమ్మడి కుటుంబంలో ఇరుకు ఇంట్లోనే ఇబ్బంది పడుతూ వచ్చాం. మా సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలును ఎన్నటికీ మరువలేం. – కొనేపల్లి పుష్పావతి, కమ్మూరు, కూడేరు మండలం

డి-ఫార్మసీ మిగులు సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు

హిందూపురం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి డి-ఫార్మసీ (డిప్లొమా ఇన్ ఫార్మసీ) కోర్సులో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 13న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల కాల వ్యవధి ఉన్న ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్ బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి ఉన్న వారు పది, ఇంటర్ మార్క్స్ లిస్టులు, స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ, టీసీ ఒరిజినల్, మూడు సెట్ల జిరాక్స్ ప్రతులు తీసుకుని బుధవారం ఉదయం 9.30 గంటలకు కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావచ్చు. ఏడాదికి రూ.8లక్షల లోపు ఆదాయం ఉన్న ఓసీ విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌తో హాజరు కావచ్చు. ప్రవేశాలు పొందిన ఓసీ విద్యార్థులు రూ.6,300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.5,700 ట్యూషన్ ఫీజు చెల్లించాలి. పూర్తి వివరాలకు 98662 73402, 97038 43680లో సంప్రదించవచ్చు.

'కాలవా' నోరు అదుపులో పెట్టుకో

- రాజకీయాలకు నువ్వు అన్‌ఫిట్
- విలేకరిగా ఉన్నప్పుడు నీ ఆస్తులు ఎంత? ఈ రోజు ఎంత?
- ఎస్సీ మహిళను బలాత్కారం చేసిన వారిని పక్కన కూర్చోబెట్టుకుని ఆరోపణలు చేస్తావా?
- మా కుటుంబం గురించి మాట్లాడే అర్హత, స్థాయి నీకు లేదు
- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఐ.ఎర్రిస్వామిరెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న ఎర్రిస్వామిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: తమ కుటుంబంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని మాజీ మంత్రి, టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.ఎర్రిస్వామిరెడ్డి హెచ్చరించారు. తమ కుటుంబంపై ఆరోపణలు చేసే అర్హత, స్థాయి ఆయనకు లేవన్నారు. అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే బి.గురునాథరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐపీ పెట్టిన కణేకల్లు మండలం హనకనహాల్‌కు చెందిన శనగల వ్యాపారి కృష్ణారెడ్డికి ఎర్రిస్వామిరెడ్డి సహకారం ఉందంటూ కాలవ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తమ కుటుంబం ఎలాంటిదో ఒకసారి తమ సొంత గ్రామమైన హనకనహాల్‌కు వెళ్లి విచారించుకోవాలని హితవు పలికారు. కృష్ణారెడ్డి చేతిలో మోసపోయిన రైతుల పక్షాన నిలిచి తమ కుటుంబం ఎలాంటి చర్యలు తీసుకుందో తెలుసుకుని మాట్లాడాలన్నారు. మా గ్రామంలోని రైతుల కోసం మంత్రి, ఇతర పెద్దలను తన సోదరుడు బి. గురునాథరెడ్డి మాట్లాడి 1,400 సబ్సిడీ విత్తన శనగను ఇప్పించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా పని చేసిన కాలవ వాస్తవలు తెలుసుకోకుండా పనికిమాలిన దగుల్బాజీలను పక్కన కూర్చోబెట్టుకుని నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోమన్నారు. మానసిక స్థితి సరిగాలేని ఎస్సీ వృద్ధ మహిళను బలాత్కారం చేసిన కేసులో నిందితులుగా ఉన్న వారిని పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడిన కాలవ... రాజకీయాలకు అనర్హుడన్నారు. 'విలేకరిగా ఉన్నప్పుడు నీ ఆస్తులు ఎంత? ఈ రోజు నీ ఆస్తులు ఎంత? ఎలా వచ్చాయి., విలువల్లేని నువ్వు కూడా మా గురించి మాట్లాడితే ఎలా?' అని మండిపడ్డారు. తనపై చేసిన ఆరోపణలపై ఊరి దేవునికట్ట వద్ద ప్రమాణం చేయడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. గ్రామంలో కులాలు, పార్టీలకు అతీతంగా ప్రజలందరూ తమ కుటుంబాన్ని ఆదరిస్తారని, తాము కూడా అంతేస్థాయిలో అక్కడి ప్రజలకు అండగా ఉంటున్నామని స్పష్టం చేశారు. సమావేశంలో హనకనహాల్‌కు చెందిన పూజారి రామాంజినేయులు, గెలివే అనిల్‌కుమార్, జయరామిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాయల్టీ అధికారులంటూ బెదిరింపు

రాప్తాడు రూరల్: రాయల్టీ అధికారులంటూ బెదిరించి డబ్బు గుంజేందుకు ప్రయత్నించిన దుండగులు చివరకు పోలీసులు పట్టుబడ్డారు. వివరాలు... తాడిపత్రి ప్రాంతానికి చెందిన ఓ ట్రాక్టర్ ఈ నెల 8న కళ్యాణదుర్గం వైపు నల్లబండల లోడుతో వెళుతుండగా రాత్రి 11 గంటలకు అనంతపురం రూరల్ మండలం కురుగుంట దాటగానే ముగ్గురు వ్యక్తులు అటకాయించారు. తాము రాయల్టీ అధికారులమంటూ డ్రైవర్‌ను బెదిరించారు. భయపడిన డ్రైవర్ ట్రాక్టర్ దిగడంతో దుండగుల్లో ఒకరు ట్రాక్టర్ ఎక్కి పక్కకు పెట్టే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో చాలా బండలు విరిగిపోయాయి. ఇంతలో దుండగులు డ్రైవర్‌ను బెదిరించి సెల్‌ఫోన్, డబ్బులు లాక్కొన్నారు. అటుగా వెళ్తున్న కొందరు అనుమానం వచ్చి సమాచారం అందించడంతో రూరల్ పోలీసులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని దుండగులను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురూ సజ్జలకాలవ గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. నిందితులపై సీఐ రామకృష్ణారెడ్డి కేసు నమోదు చేసి, బాధితుడికి నష్టపరిహారం ఇప్పించారు.

వివాహిత ఆత్మహత్య

పెనుకొండ రూరల్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు... పెనుకొండ మండలం మరువపల్లికి చెందిన పుష్పలత (30)కు గుట్టూరు నివాసి మహేంద్రతో పదేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలుగకపోవడంతో తీవ్ర మనోవేదనకు లోనైన ఆమె శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం వేకువజామున ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై ఎస్‌ఐ రమేష్ బాబు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు


ఆంజనేయులు మృతదేహం

గుంతకల్లు రూరల్: ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో మరో బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం దంచర్లకు చెందిన ఆంజనేయులు (52), పాతకొత్తచెరువు నివాసి బాలకృష్ణ గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై గుత్తి వైపుగా గొర్రెల మంద వద్దకు వెళుతుండగా పాతకొత్తచెరువు దాటగానే వెనక నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో బైకు ఢీకొంది. ఘటనలో ఆంజనేయులు, బాలకృష్ణ రోడ్డుపై పడ్డారు. తలకు తీవ్ర గాయమై ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన బాలకృష్ణను గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు తన వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఆంజనేయులకు భార్య మహాలక్ష్మి, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణమైన బైక్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

బాలుడి బలవన్మరణం


మృతుడు వినయ్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: తల్లిదండ్రుల మందలింపుతో మనస్తాపం చెందిన ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పుట్టపర్తి మండలం బత్తలపల్లికి చెందిన గంటల మారెమ్మ ఆలయ పూజారి నాగరాజు, కల్పన దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో రెండో కుమారుడు వినయ్‌కుమార్ (12) పెడపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం 5 గంటలకు ఆలయంలో పూజాదికాలు నిర్వహణకు వెళ్లేందుకు సిద్ధమైన నాగరాజు... నిద్రిస్తున్న వినయ్‌కుమార్‌ను లేపి ద్విచక్ర వాహనంపై తల్లిని, అవ్వను ఆలయం వద్ద విడిచి రావాలని పురమాయించాడు. నిద్ర లేవకుండా ఆలస్యం చేయడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ద కుమారుడు గోపీచంద్ నిద్రలేచి అమ్మను, అవ్వను ద్విచక్రవాహనంపై పిలుచుకెళ్లి ఆలయం వద్దకు చేరుకున్నాడు. ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన వినయ్‌కుమార్... నెలరోజుల క్రితం గృహ ప్రవేశం చేసిన ఇంట్లోకి వెళ్లి లోపల గదిలో కొక్కేనికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పూజాదికాలు ముగిసిన తర్వాత అందరూ ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు ఎంత సేపు పిలిచినా తలుపు తీయకపోవడంతో వెనుక ఉన్న కిటికీ అద్దాలు పగులగొట్టి పరిశీలించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న వినయ్‌కుమార్‌ను చూసి, వెంటనే తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. శరీరం కొంత వేడిగా ఉండడం గమనించిన స్థానికులు వెంటనే కారు ఏర్పాటు చేయడంతో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఘటనపై ఎస్‌ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జూదరుల అరెస్ట్

- రూ. 3 లక్షల నగదు, 25 ద్విచక్రవాహనాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు


లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామ సమీపంలోని ఓబుళాపురం చెరువు వద్ద పేకాట ఆడుతున్న 21 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.3 లక్షలు నగదు, 20 సెల్‌ఫోన్లు, 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు హిందూపురం డీఎస్పీ కంజాక్షన్, రూరల్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ గోపి, సిబ్బంది గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో చెరువు వద్ద భారీగా వాహనాలు కనిపించడంతో అక్కడకు వెళ్లి పరిశీలిస్తే భారీ మొత్తాన్ని వెచ్చిస్తూ పేకాట ఆడుతున్న 21 మంది పట్టుబడ్డారు. పోలీసుల రాకను గమనించిన ఏడుగురు అక్కడి నుంచి పరారయ్యారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'దుర్గం'లో చైన్‌స్నాచింగ్


ఘటనను వివరిస్తున్న బాధితురాలు ఉష

కళ్యాణదుర్గం: కాలినడకన వెళుతున్న ఓ వివాహిత మెడలోని బంగారు మాంగ్యలం చైన్‌ను దుండగుడు లాక్కెళ్లాడు. బాధితురాలు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గంలోని ఆర్టీసీ బస్టాండ్ కాలనీలో నివాసముంటున్న ఉష.. ఆదివారం ఉదయం తన స్నేహితురాలితో కలిసి పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో వేకువజామునే ఇంటి వద్ద నుంచి బస్టాండ్‌కు ఒంటరిగా బయలుదేరిన వారిని వెంబడిస్తూ వచ్చిన దుండగుడు.. నిర్మానుష్య ప్రాంతానికి చేరుకోగానే వెనుక నుంచి ఉష మెడలోని మూడు తులాల బరువైన బంగారు మాంగల్యం చైన్‌ను లాక్కొని వడ్డే కాలనీ వైపు పరుగు తీశాడు. ఉషతో పాటు ఆమె స్నేహితురాలు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకునే లోపు ఆగంతకుడు కనిపించకుండా వెళ్లిపోయాడు. బాధితురాలు వెంటనే డయల్ 100కు సమాచారం అందించడంతో కానిస్టేబుళ్లు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ఆ పరిసర ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చేపట్టారు. దుండగుడు ఆచూకీ లక్ష్యం కాకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతం.. బాలురకు తీవ్రగాయాలు


గాయపడిన దీక్షిత్

ధర్మవరం అర్బన్: విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరంలోని రామ్‌నగర్‌కు చెందిన దీక్షిత్ (3వ తరగతి), ధర్మతేజ (5వ తరగతి) స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆడుకుంటుండగా బంతి నేరుగా వెళ్లి ఓ ఇంటి బాత్‌రూంపై పడింది. దీంతో దీక్షిత్, ధర్మతేజ మిద్దె ఎక్కి కడ్డీ సాయంతో బంతిని తీస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ లైన్ తగిలి షాక్‌కు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఘటనపై టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

సంతల ఆదాయం రూ.3.50 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.50 లక్షలకుపైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్ బాషా, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,81,090 వసూలు కాగా, ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.1,69,700 మేర వసూలైనట్లు తెలిపారు.

వాల్మీకులను వంచించింది పరిటాల కుటుంబమే


మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

చెన్నేకొత్తపల్లి: స్వార్థ రాజకీయాలకు వాల్మీకులను వాడుకొని వంచించిన ఘనత పరిటాల కుటుంబానికే చెందుతుందని మండల వాల్మీకి సంఘం నాయకులు ఆరోపించారు. ఆదివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండల వాల్మీకి సంఘం నాయకులు ఎంపీపీ అంజలీతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పెనుకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో పరిటాల కుటుంబ సభ్యులు పరిటాల రవీంద్ర, సునీతమ్మ 25 ఏళ్ల పాటు ఫ్యాక్షన్ , వర్గ రాజకీయాలు నడిపారన్నారు. ఈ సందర్భంలో వారి పక్షాన ఉన్న వాల్మీకులను తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకొని వదిలేశారన్నారు. ఇకనైనా రాప్తాడు నియోజక వర్గంలోని వాల్మీకులు.. పరిటాల కుటుంబం మోసాలను గుర్తించి బయటకు రావాలని కోరారు.

బీజేపీ పాలనలో అప్పలపాలు


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు


అనంతపురం అర్బన్: బీజేపీ పాలనలో రైతులు అప్పుల పాలవుతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏఐకేఎస్ (ఆల్ ఇండియా కిసాన్ సభ) జాతీయ కౌన్సిల్ సమావేశాల పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 17 వరకు కర్నూలులో ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నారన్నారు. 15న రైతుల మహా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. సభకు ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు అశోక్‌దావలె, ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రకుమార్, శివారెడ్డి, రామిరెడ్డి, ఒన్నూరప్ప, శ్రీనివాసులు, పుల్లన్న, రాజు పాల్గొన్నారు.

కరాటేలో సోహాన్వికరెడ్డికి బంగారు పతకం



అనంతపురం: శ్రీసత్యసాయి జిల్లా తలుపులకు చెందిన ఎం.సోహాన్విక రెడ్డి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది. డిసెంబర్ 9, 10 తేదీల్లో బెంగళూర్‌లో జాతీయ స్థాయి జూనియర్స్ కరాటే పోటీలు జరిగాయి. ఇందులో తలుపులకు చెందిన ఎం. సోహాన్విక రెడ్డి బంగారు పతకం సాధించింది. ఎనిమిదేళ్ల వయసులో ఈ ఘనత సాధించిన సోహాన్విక రెడ్డిని పలువురు అభినందించారు.

260 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు

కనగానపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 260 మందికి కంటి పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు అంకే అశోక్ తెలిపారు. వైఎస్సార్ కడప పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఈ శిబిరం నిర్వహించారు. కనగానపల్లితో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వృద్ధులు, మహిళలకు కంటి పరీక్షలు చేశారు. వీరికి అంకే అశోక్ సహకారంతో భోజనం ఏర్పాటు చేశారు.

నేడు అరుణాచలేశ్వరుడి ప్రదర్శన

అనంతపురం కల్చరల్: పవిత్ర కార్తీకమాస చివరి సోమవారాన్ని పురస్కరించుకొని సాయిట్రస్టు ఆధ్వర్యంలో అరుణాచల గిరి ప్రదక్షిణ నమూనాను ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలులో అరుణాచల ఆలయ నమూనాను అందంగా తీర్చిదిద్దారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అభిషేకాలు, అర్చనలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రదోషకాలంలో లింగార్చన, గిరిజాకల్యాణం జరుగుతాయన్నారు.

సాహో అనిపిస్తున్న సోహా నృత్యకళ


శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేస్తున్న సోహా

- శాస్త్రీయ నృత్యంలో రాణిస్తున్న మహమ్మద్ సోహా
- చదువుతో పాటు క్రీడల్లోనూ అద్భుత ప్రతిభ

మనసుకు వినసొంపైన సంగీతం వినబడితే ఆమె శరీరం తనకు తానే లయబద్ధంగా కదలికలు చేస్తుంది. భారతీయ నృత్యరీతులపై మక్కువ ఆమెను జాతీయ వేదికలపై నాట్యమయూరిగా నిలిచేలా చేశాయి. ఇస్లాం సంప్రదాయాలను గౌరవిస్తూనే దేశ సంస్కృతికి పట్టం కట్టే కూచిపూడి, భరత నాట్యంలో తనకు తానే సాటిగా నిలిచింది. తన తల్లి అందుకోలేని లక్ష్యాన్ని తాను అందిపుచ్చుకున్న మహమ్మద్ సోహా విజయ ప్రస్థానంపై 'సాక్షి' కథనం.



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న సోహా

అనంతపురం కల్చరల్: అనంతపురానికి చెందిన అర్జుమాన్ పర్వీన్, సాదిక్ దంపతులకు దేశ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు శాస్త్రీయ నృత్యమన్నా ఎంతో గౌరవం. పర్వీన్ తన చిరుప్రాయంలో నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్ వద్ద కూచిపూడి నేర్చుకునేవారు. ఉన్నత చదువులు, పెళ్లి నేపథ్యంలో ఆమె నాట్య సాధన అర్ధంతరంగా ఆగిపోయింది. ఈ క్రమంలో తాను అందుకోలేని లక్ష్యాన్ని భర్త ప్రోత్సాహంతో కుమార్తె ద్వారా చేరుకోగలిగింది. తమ కుమార్తె మహమ్మద్ సోహాకు చిరు ప్రాయం నుంచే పట్నం శివప్రసాద్ వద్ద శాస్త్రీయ నృత్యం నేర్పిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే అద్భుత ప్రతిభను సొంతం చేసుకున్న సోహా జాతీయస్థాయి ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలో సోహా మాట్లాడుతూ.. తన తల్లి, పిన్ని ఇద్దరూ గురువు శివప్రసాద్ వద్ద నాట్యం నేర్చుకుని ఎన్నో ప్రదర్శనలిచ్చారని గుర్తు చేశారు. ఇంకా ఎంతో నేర్చుకోవాలన్న తన తల్లి ఆకాంక్షను నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా సాధన చేస్తున్నానన్నారు. ముఖ్యంగా విదేశాల్లో దేశీయ నాట్య రీతులు ప్రదర్శించి తన తల్లి కోరిక తీరుస్తాననే ధీమా వ్యక్తం చేశారు.

అవార్డులు ఇవే..

- 2021లో అనంతపురంలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సమయంలోనే సోహా వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చింది. ఎన్నో ప్రశంసలతో పాటూ అవార్డులను, రివార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల నాగపూర్‌లో జరిగిన జాతీయ జానపద నృత్య పోటీల్లో ప్రథమ స్థానం, కూచిపూడిలో తృతీయ స్థానం దక్కించుకుంది.
- ఈ ఏడాది అనంతలో సందడిగా సాగిన బాలోత్సవంలో వేలాది మంది ప్రదర్శనలిస్తే రెండో స్థానంలో నిలిచి ప్రశంసలందుకుంది. అలాగే హైదరాబాదులో నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య పోటీల్లో బహుమతిని దక్కించుకుంది.
- నాట్యంలోనే కాకుండా ఇతర క్రీడల్లోనూ సోహా రాణిస్తోంది. రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్, జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో పతకాలు దక్కించుకుంది.

విద్యార్థి దశ నుంచే సేవాభావానికి అడుగులు

- 'పేదల న్యాయమూర్తి కిష్టప్ప' పుస్తక ఆవిష్కరణలో వక్తలు


రిటైర్డ్ జడ్జి కిష్టప్ప రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, న్యాయవాదులు

అనంతపురం ఎడ్యుకేషన్: నిరుపేద కుటుంబంలో జన్మించి, కష్టపడి చదివి జిల్లా న్యాయమూర్తిగా ఎదిగిన మారెక్కగారి కిష్టప్ప..విద్యార్థి దశ నుంచే సేవా భావంపై అడుగులు వేసి, పేదలందరి వాడుగా గుర్తింపు తెచ్చుకున్నారని వక్తలు కొనియాడారు. జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా ఇటీవల లీగల్ సర్వీసెస్ రైట్స్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో 'న్యాయ సేవారత్న' అవార్డు అందుకున్న జిల్లా రిటైర్డ్ జడ్జి, ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్పను ఆదివారం సన్మానించారు. డీజీపీ కార్యాలయ విశ్రాంత సీఏఓ డాక్టర్ బాలకొండ ఆంజనేయులు అధ్యక్షతన సభ నిర్వహించారు. పూరిగుడిసె నుంచి జిల్లా జడ్జిగా ఎదిగిన ప్రస్థానంతో పాటు జీవిత చరిత్రపై 'లీగల్ సర్వీసెస్ రైట్స్ ప్రొటెక్షన్' ఆధ్వర్యంలో రూపొందించిన 'పేదల న్యాయమూర్తి కిష్టప్ప' పుస్తకాన్ని ఆవిష్కరించారు. నగరంలోని వాల్మీకి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, రిటైర్డ్ జిల్లా జడ్జి మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, రాయలసీమ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్‌వీ పుల్లారెడ్డి, అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విశ్వనాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బీసీ రమేష్‌గౌడ్, సీఐడీ స్పెషల్ పీపీ రాజశేఖర్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు. కిష్టప్ప మాట్లాడుతూ అన్ని వర్గాలకు హక్కుగా రావాల్సిన అంశాలను పరిగణలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకున్నానన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతు సమాజ బాధ్యతగా తీసుకుంటే మార్పు సాధ్యమేన్నారు.

పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న దాదులూరు పోతలయ్యస్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయంలోని పోతలయ్య, చెన్నేకేశవస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

చెక్క భజన గురువుకు జాతీయ పురస్కారం

గుత్తి రూరల్: లచ్చానుపల్లి గ్రామానికి చెందిన చెక్క భజన గురువు ఎస్.చిన్న జమాల్‌వలికు తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం -2023 లభించింది. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విజయవాడకు చెందిన జాతీయ స్వచ్ఛంద సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో పురస్కారం అందించారు. చిన్న జమాల్‌వలి కొన్నేళ్లుగా చెక్క భజన నేర్పుతున్నాడు. ఆయన సేవలను గుర్తించి శ్రీ కృష్ణదేవ రాయ కళావేదిక, విశ్వకర్మ గాయిత్రి నాట్య కళావేదిక ఆధ్వర్యంలో సత్కరించి, సన్మాన పత్రం, నంది అందజేశారు. జమాల్‌వలి మాట్లాడుతూ చెక్క భజన అంశంలో ఇప్పటి వరకూ 300 మందికి పైగా శిక్షణ ఇచ్చానన్నారు.

ఐక్యతతోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి


పూజలందుకున్న అభయాంజనేయుడు, హోమం నిర్వహిస్తున్న పండితులు

అనంతపురం కల్చరల్: ఐక్యతతో ఉంటేనే ఆర్యవైశ్యులు అభివృద్ధి చెందుతారని ఆవోపా ప్రతినిధులు అన్నారు. ఆదివారం ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఆవోపా సభ్యుల సమావేశం అనంతరం బీకేఎస్ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద కార్తీక వనభోజనాలు జరిగాయి. అంతకు ముందు స్వామివారికి అభిషేకాలు, శాంతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవోపా ప్రతినిధులు జయంతి శ్రీనివాసులు శెట్టి, జనార్ధన్, చిందలూరు చంద్రమోహన్ మాట్లాడారు. అందరూ కలిసికట్టుగా ఐక్యంగా ఉండడానికే కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్విజ్ ఆసక్తికరంగా సాగింది. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆవోపా పట్టణ, జిల్లా కార్యవర్గ సభ్యులు, మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలోనే ఉత్తమ జీవితం

- ఇస్తెమాలో ప్రసంగించిన మత పెద్దలు


మాట్లాడుతున్న దావణగెరె బాబా ఫకృద్దీన్


చిన్నారికి బహుమతి అందిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక మార్గం ఏ వయస్సు వారికైనా ఉత్తమ జీవితాన్ని ప్రాప్తింపజేస్తుందని పలువురు మత పెద్దలన్నారు. తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారుక్ 14వ వార్షికోత్సవ సున్ని ఇస్తెమా ఆదివారం ఘనంగా జరిగింది. తెహరిక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజాఖాద్రీ నేతృత్వంలో స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఇస్తెమాలో భూసావల్ నుంచి సయ్యద్ అబ్దుల్ హబీబ్ సాహెబ్, కర్ణాటక నుంచి నాసిర్ రజాఖాన్ ముఖ్య ప్రసంగీకులుగా నగరానికి విచ్చేసి, దైవమార్గం విశిష్టతను వివరించారు. యువత తమ గమ్యాన్ని మరిచిపోయి ఫ్యాషన్ ఒరవడిలో తప్పుదోవ పడుతోందన్నారు. వేలాదిగా తరలి వచ్చిన ముస్లింలకు ఇతర సౌకర్యాలతో పాటు ప్రత్యేకంగా భోజన వసతి కల్పించారు. సాయంత్రం ప్రముఖ న్యూరో ఫిజీషియన్ కృష్ణకాంతరెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం మహ్మద్ ప్రవక్త (స) ధరించిన దుస్తులు, పవిత్ర కేశాలు భక్తుల సందర్శనార్థం ఉంచారు. మేయర్ వసీం, కార్పొరేటర్లు జనబలం బాబా, రహంతుల్లా, సైపుల్లాబేగ్ తదితరులు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ముతవల్లి ఫరుదుద్దీన్, పర్వీష్, షబ్బీర్ అహమద్, హబీబ్, డాక్టర్ షఫీ, మహబూబ్ బాషా, హుస్సేన్ పాల్గొన్నారు.

ఖురాన్ పఠనంతో ఆనందమయ జీవితం

ఖురాన్ పఠనంతో ఆనందమయ జీవితాన్ని ఆస్వాదించొచ్చని మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్ అన్నారు. ఆదివారం నగరంలోని నూరాని మసీదులో పవిత్ర ఖురాన్ పఠన సెమీ ఫైనల్స్ స్థాయి కంఠస్త పోటీలు జరిగాయి. ముఫ్తి ముదస్సర్ మౌలానా అబ్దుల్ అలీం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మేయర్ వసీం, నదీం అహమ్మద్ హాజరై, ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు అందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ గ్రూపుల వారిగా పోటీలు నిర్వహించామని, అనంతపురం, తాడిపత్రి, గుత్తి, హిందూపురం, గుంతకల్లు ప్రాంతాల నుంచి పోటీలకు వచ్చారు. ముదస్సిర్, అబ్దుల్ అలీ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ విజయవాడ ఆధ్వర్యంలో జరిగే ఫైనల్స్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హఫీజ్ వలీయుల్లా, మౌలానా షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


గోవింద నామస్మరణ చేస్తున్న మాలధారులు

అనంతపురం కల్చరల్: 'ఏడు కొండలవాడా వేంకటేశ్వరా.. గోవిందా గోవిందా' అంటూ భక్తుల శరణుఘోషతో నగరంలోని ఆర్ఎఫ్‌రోడ్డు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం మార్మోగింది. ఆదివారం గోవిందమాల బృందం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ప్రధాన అర్చకులు హరికిషోర్ శర్మ, గోపిశర్మ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి పరిణయ ఘట్టాన్ని నేత్రపర్వంగా జరిపించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ మాంగళ్యధారణ, ఎదురుకోళ్లు, సప్తపది ఘట్టాలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మధ్యాహ్నం నారాయణ సేవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు ప్రసాద వితరణలో పాల్గొన్నారు. సాయంత్రం పురవీధుల్లో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో గోవింద మాల బృందం నిర్వాహకులు నాగరాజు, రమేష్ బాబు, వెంకటనారాయణ, వేమారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీవి ప్రజావ్యతిరేక విధానాలు


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న పౌర చైతన్య వేదిక నాయకులు

అనంతపురం అర్బన్: బీజేపీవి ప్రజావ్యతిరేక విధానాలు అని, ప్రజాస్వామ్య హక్కులు అణచివేతకు గురవుతున్నాయని పౌర చైతన్య వేదిక జిల్లా కన్వీనర్ రాఘవేంద్ర అన్నారు. క్రిమినల్ చట్టాలకు క్రూర సవరణలు ఉపసంహరించాలన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ కిరాతక దాడులు ఆపాలన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినం పురస్కరించుకొని వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలియజేశారు. రాఘవేంద్ర మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం క్రిమినల్ చట్టాల సవరణ పేరుతో మరింత నిరంకుశ చట్టాలను తయారు చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను విమర్శించిన వారిని అణిచివేస్తుందన్నారు. కిరాతకంగా గాజాపై దాడులకు పాల్పడుతూ ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్న ఇజ్రాయిల్‌కు నరేంద్ర మోదీ ప్రభుత్వం మద్దతు నిలవడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు, ప్రజావ్యతిరేక విధానాల అడ్డుకట్టకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో మానవత రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, రెడ్ డ్రాప్ సంస్థ ప్రతినిధి సర్దార్, వేదిక నాయకులు సుబ్రమణ్యం, శ్రీధర్, తబ్రేజ్, తదితరులు పాల్గొన్నారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. ముందుగా పంచామృతాభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీకమాసం నాల్గో ఆదివారం కావడంతో ఆలయంలో సామూహిక విష్ణుసహస్త్ర నామ పారాయణం జరిగింది. స్వామికి బంగారు కవచ సేవ, ఆకుపూజ, అర్చన మహా నైవేద్యం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ స్వామికి బంగారు కవచాన్ని ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయం బయట పెద్ద ఎత్తున మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పీటీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా చెన్నకేశవులు



అనంతపురం ఎడ్యుకేషన్: ప్రైవేట్ ఉపాధ్యాయ, అధ్యాపక సమాఖ్య (పీటీఎల్‌ఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా నగరానికి చెందిన డాక్టర్ కె.చెన్నకేశవులును ఎన్నుకున్నారు. రెండు రోజుల కిందట విజయవాడలో సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అన్ని జిల్లాల నుంచి హాజరైన కమిటీ సభ్యులు ప్రైవేట్ టీచర్లు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా, జిల్లా నుంచి చెన్నకేశవులుకు రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పిస్తూ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. తనపై నమ్మకం ఉంచి నియమించిన ప్రతి ఒక్కరికీ చెన్నకేశవులు కృతజ్ఞతలు తెలియజేశారు.

భక్తులతో కిటకిటలాడిన అశ్వత్థం

పెద్దపప్పూరు: కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా చిన్నపప్పూరులో వెలిసిన అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు పెన్నానది లో పుణ్యస్నానాలు ఆచరించి నారాయణస్వామి, శ్రీచక్ర భీమలింగేశ్వర స్వామి చుట్టూ తడి దుస్తులతో ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వాములకు ముడుపులు, కానుకలతో పాటు తల నీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం సదుపాయాలు కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుధీర్ కుమార్ శర్మ, బాల సుబ్రమణ్యం శర్మ భక్తులకు ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

తుమ్మల మారెమ్మ ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని గుత్తిరోడ్డులోని తుమ్మల మారెమ్మ గుడి 12వ వార్షికోత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు పి.లక్ష్మన్న నేతృత్వంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మారెమ్మ తల్లి ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం, తీర్థప్రసాదాల వితరణతో పాటు భక్తులకు అమ్మవారి శేష వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, సూర్యనారాయణ, రవి, చంద్రశేఖర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే కురుబల అభివృద్ధి


కనకదాస విగ్రహానికి పూజలు చేస్తున్న జెడ్పీటీసీ


గొరవయ్యల నృత్యాలు

రాప్తాడు: కురుబలు ఐకమత్యంతో రాజకీయంగా, విద్యాపరంగా, ఆర్థిక రంగాల్లో రాణిస్తేనే అభివృద్ధి సాధ్యమని కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి పేర్కొన్నారు. మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో కనకదాస జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కురుబ సంఘం నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన కురుబలు నిలదొక్కుకోవాలంటే ఉద్యోగ, ఆర్థిక, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం కురుబలను ఓటు బ్యాంకుగా వాడుకుంటే, జగనన్న ప్రభుత్వం రాజకీయంగా అవకాశాలు కల్పించి, పెద్ద పీట వేసిందన్నారు. అనంతరం కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతిని సన్మానించారు. అనంతరం గొరవయ్యల నృత్యాలు ఆకట్టుకున్నాయి. గొరవయ్యలకు కురుబలు పాలు తాపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రుక్మిణమ్మ, కురుబ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఎమ్మెల్యే పరామర్శ


బాధితుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉరవకొండ మండలం పెన్నహోబిళంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు మల్లేష్‌ను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డ్యూటీ డాక్టర్లను సూచించారు. ఉపాధ్యాయుడి ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావుతో ఆరా తీశారు. ఎప్పటికప్పుడు మల్లేష్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. బాధితుడి సతీమణి శివలక్ష్మితో పాటు ఇతర కుటుంబ సభ్యులతోనూ ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతా సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.